క్లుప్తంగా

కర్నూలుకు వెళ్లి పింఛన్ అందజేత


బసమ్మకు పింఛన్ అందజేస్తున్న వలంటీర్ ఆంజనేయులు

కోసిగి: మండల కేంద్రంలోని రామక్కమ్మ దేవి ఆలయ సమీపంలో నివాసం ఉంటున్న కిందింటి బసమ్మ ఊపిరితిత్తుల వ్యాధితో బాధపడుతూ కర్నూలు ఆస్పత్రిలో చికిత్స పొందుతోంది. ఆమె మూడు రోజులుగా ఆస్పత్రిలో ఉందని తెలుసుకున్న వలంటీర్ ఆంజనేయులు ఆదివారం కర్నూలు ఆస్పత్రికి వెళ్లి వృద్ధాప్య పింఛన్ అందజేశారు. ప్రభుత్వానికి, వలంటీర్‌కు బసమ్మ కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.

ఆదర్శ పాఠశాలలో ప్రవేశానికి దరఖాస్తులు

కోసిగి: కోసిగిలోని ఏపీ మోడల్ స్కూల్ 6వ తరగతిలో ప్రవేశానికి దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపల్ సమీరారెడ్డి తెలిపారు. ఈనెల 31వ తేదీలోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. 6వ తరగతిలో 100 సీట్లు ఉన్నాయని తెలిపారు. ప్రభుత్వ గుర్తింపు పొందిన పాఠశాలలో 5వ తరగతి చదువుతున్న విద్యార్థులు అర్హులన్నారు. దరఖాస్తు చేసుకున్న వారికి ఏప్రిల్ 21వ తేదీ ప్రవేశ పరీక్ష ఉంటుందన్నారు. మరిన్ని వివరాలకు ఏపీ మోడల్ స్కూల్‌లో సంప్రదించాలని సూచించారు.

నేడు ప్రధానోపాధ్యాయుల సమావేశం

కోసిగిలోని ఏపీ మోడల్ స్కూల్‌లో సోమవారం మండలంలోని వివిధ పాఠశాలల ప్రధానోపాధ్యాయులతో సమావేశం నిర్వహించనున్నట్లు ప్రిన్సిపల్ సమీరారెడ్డి తెలిపారు. మండల విద్యాధికారులు హాజరుకానున్నట్లు చెప్పారు.

బీరప్పస్వామి ఆలయ నిర్మాణానికి విరాళం


మంత్రాలయం: పెద్దపాడు మోడల్ స్కూల్ సమీపంలో బీరలింగేశ్వరస్వామి దేవాలయ నిర్మాణానికి ఆదివారం మంత్రాలయం మండలం కురువ సంఘం అధ్యక్షుడు మల్లికార్జున రూ.25 వేలు విరాళంగా అందజేశారు. ఈ సందర్భంగా కర్నూలు జిల్లా కురువ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఎంకే రంగస్వామి, అసోసియేట్ అధ్యక్షుడు గుడిసె శివన్న మాట్లాడుతూ.. బీరలింగేశ్వర ఆలయంతో పాటు కల్యాణ మండపం నిర్మిస్తున్నట్లు తెలిపారు. భక్తులు సహాయ సహకారాలు అందించాలని కోరారు. సంఘం నాయకులు వీరనాగప్ప, దేవిరెడ్డి, శివరాం, శివ తదితరులు పాల్గొన్నారు.

సిమెంటు రోడ్డు పనులు ప్రారంభం


పనులను పరిశీలిస్తున్న సర్పంచ్

కౌతాళం: మండల కేంద్రంలో ముమ్మరంగా అభివృద్ధి పనులను చేపట్టినట్లు సర్పంచ్ పాల్ దినకర్, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ ప్రహ్లదచారి అన్నారు. ఆదివారం పల్లేదగేరి, తలారిగేరిల్లో సిమెంటు రోడ్డు పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. గడప గడపకు మన ప్రభుత్వం నిధులు మంజూరు కావడంతో ఈ పనులను ప్రారంభించినట్లు తెలిపారు. సచివాలయానికి రూ. 40 లక్షల చొప్పున మూడు సచివాలయాలకు రూ. 1.20 కోట్లు మంజూరు చేయడంతో అభివృద్ధి పనులను వేగవంతం చేసినట్లు చెప్పారు. సిమెంటు రోడ్లు, డ్రైనేజీ కాలువలు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ఉప సర్పంచ్ తిక్కయ్య, పూజారిలింగ, రామకృష్ణ, వడ్డెరాము, అబ్దుల్ సమద్ పాల్గొన్నారు.

దేవరగట్టులో ప్రత్యేక పూజలు



హొళగుంద: ఉమ్మడి జిల్లాలో దసరా ఉత్సవాలకు ప్రత్యేకత సంతరించుకున్న దేవరగట్టులో ఆదివారం స్వామివారాన్ని పురస్కరించుకుని మాళ మల్లేశ్వరస్వామికి ప్రత్యేక అలంకరణ, పూజలు జరిగాయి. ఈ సందర్భంగా పూజారులు ఆలయంలోని మూలవిరాట్‌లకు తెల్లవారుజామున సుప్రభాత సేవ, అభిషేకాలు, రుద్రాభిషేకం, బండరార్చన, కుంకుమార్చన, మహామంగళారతి, నైవేద్య సంతర్పణతో పాటు ఇతర ప్రత్యేక పూజలను శాస్త్రోక్తంగా నిర్వహించిన పూజారులు అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలను అందజేశారు. స్వామిని దర్శించుకోవడానికి వివిధ ప్రాంతాలకు చెందిన భక్తులు తరలివచ్చారు.

మహిళ మృతదేహం లభ్యం

కోడుమూరు రూరల్ : కోడుమూరు పోలీస్ స్టేషన్ పరిధిలోని లద్దగిరి వద్ద ఉన్న హంద్రీనీవా కాల్వలో ఓ గుర్తు తెలియని మహిళ మృతదేహం ఆదివారం లభ్యమైంది. మృతురాలి వయస్సు 35 నుంచి 40 సంవత్సరాల మధ్యలో ఉంటుందని, నలుపు, పసుపు పచ్చ కలర్ చీర ధరించడంతో పాటు మెడలో ఎర్రపూసల దండ ఉందని పోలీసులు తెలిపారు. శవం నీటిలో చాలా రోజుల నుంచి ఉండడంతో బాగా ఉబ్బిపోయి గుర్తు పట్టలేని విధంగా ఉందన్నారు. అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు కోడుమూరు పోలీసులు తెలిపారు.

ప్రణాళిక చదువు.. విజయం సులువు

- ఈ నెల 18 నుంచి పదో తరగతి పరీక్షలు
- నియోజకవర్గంలో పరీక్ష రాయనున్న 4 వేల మంది విద్యార్థులు
- ఒత్తిడిని అధిగమిస్తే మంచి ఫలితాలు
- ఎక్కువ మార్కులు సాధించడానికి కొన్ని జాగ్రత్తలు పాటించాలి
- విద్యార్థులకు సూచనలిస్తున్న ఉపాధ్యాయులు

ప్రస్తుతం పరీక్షల కాలం. ఇంటర్ పరీక్షలు జరుగుతున్నాయి. ఈ నెల 18వ తేదీ నుంచి పదో తరగతి పరీక్షలూ ప్రారంభం కానున్నాయి. పరీక్షలంటేనే విద్యార్థుల్లో భయం సహజం. ఆందోళన వీడి ప్రశాంతంగా పరీక్షలు రాస్తే మంచి మార్కులు సాధించేందుకు అవకాశం ఉంటుంది. ప్రణాళికతో చదివితే విజయం సులువే. కొన్ని రోజులు ఒత్తిడికి దూరంగా ఉండి ప్రణాళికాబద్ధంగా, ఆత్మ విశ్వాసంతో ముందుకెళ్తే అనుకున్న లక్ష్యాన్ని సాధించడం అసాధ్యం కాదు. ఈ నేపథ్యంలో విద్యార్థులు ఎలా చదవాలి.. తీసుకోవాల్సిన జాగ్రత్తలపై నిపుణులు, ఉపాధ్యాయుల సూచనలు, సలహాలు.


పరీక్షలు రాస్తున్న విద్యార్థులు (ఫైల్)

ఆదోనిఅర్బన్: పరీక్షలంటే నేర్చుకున్న విషయాలను స్పష్టంగా, పూర్తిగా తెలియజేయడానికి ఒక అవకాశం. మీ స్థాయిని కొలిచే కొలబద్ద. ఉన్నత స్థితికి చేరడానికి నిరూపించుకునే ఒక వేదిక. చాలామంది విద్యార్థులు కొన్ని ముఖ్యమైన ప్రశ్నల పట్టికను తయారు చేసుకుని వాటిని మాత్రమే చదువుతూ ఉంటారు. కానీ ఒకసారి ఊహించని ప్రశ్నలు పరీక్షల్లో ఎదురవుతాయి. అప్పుడే మీ పరిస్థితి తారుమారవుతుంది. కాబట్టి అన్ని ప్రశ్నలకు జవాబులను నేర్చుకోవడం ఉత్తమం. ఎప్పుడైతే మీకు అన్ని సబ్జెక్టులపై పూర్తి అవగాహన పెంచుకుంటారో విశ్వాసం దానంతటకదే మీదరి చేరుతుంది. పరీక్ష హాలులో ధైర్యంగా అడుగుపెట్టగలరు.

ఎక్కువ మార్కులు తెచ్చుకోవడానికి కొన్ని జాగ్రత్తలు

- కష్టమైన పాఠాలను మనస్సు ప్రశాంతంగా ఉన్నప్పుడు నాలుగైదుసార్లు అయినా చదివి అర్థం చేసుకోవాలి.
- పరీక్షల్లో ప్రశ్నలు ఏ రకమైనవి అడుగుతారో అవగాహన కోసం మునుపటి ప్రశ్న పత్రాలను పరిశీలించాలి.
- జవాబులను సొంత మాటల్లో రాస్తే వేగం పెరుగుతుంది
- అక్షరాలు స్పష్టంగా, గుండ్రంగా రాసి పదాల మధ్య స్థలం ఉంచి రాయడం అలవాటు చేసుకోవాలి. దిద్దే వారికి అర్థం కాకపోతే ఎంత కరెక్ట్‌గా రాసినా మార్కులు తక్కువగానే వస్తాయి.
- ప్రశ్నలన్నింటినీ చదివిన తర్వాతనే రాయడం మొదలు పెట్టాలి. రాయగలనని అనుకున్న ప్రశ్నలను మొదట రాసి తర్వాత రాసే ప్రశ్నలకు కొద్దిగా సమాధానం తగ్గినా మార్కులు ఎక్కువ పొందే అవకాశం ఉంది.
- జవాబులో ముందుగా ముఖ్యమైన పాయింట్లు రాయాలి.
- చిన్న ప్రశ్నలకు ఎక్కువ రాయకూడదు. అలా చేస్తే చివరి ప్రశ్నలకు సమయం చాలదు.
- ప్రశ్నకు ఉన్న నంబర్‌లను మాత్రమే రాయాలి. సొంత నంబర్లు వేయడం చాలా ప్రమాదం. అవసరమైన పెన్నులు, పెన్సిళ్లు మర్చిపోవద్దు. స్కెచ్ పెన్నులు కూడా ఉపయోగించడం ద్వారా సమాధాన పత్రాలు ఆకర్షణీయంగా కనిపిస్తాయి.
- రోజు అరగంట ముందే పరీక్ష కేంద్రానికి చేరుకోవడం మంచిది. ఇన్విజిలేటర్‌తో తప్పా పరీక్ష హాలులో విద్యార్థులెవరితోనూ మాట్లాడవద్దు.
- ఒకటికి రెండుసార్లు పరీక్ష హాల్ టికెట్‌ను సరి చూసుకోవాలి. తల పక్కకు తిప్పకుండా సమాధానాలు రాయడం మంచిది. సమయం అయ్యేంతవరకు పరీక్ష హాలు నుంచి బయటకు రాకపోవడం మంచిది.
- పరీక్ష కోసం చదివే ముందు కొన్ని నిమిషాలు ఆ రోజు ఏమి చేయాలో ప్లాన్ చేసుకోండి.
- పరీక్షల సమయంలో మీ బ్రెయిన్ సరిగా తన విధులు నిర్వర్తించాలంటే నిద్ర చాలా అవసరం. రాత్రి కనీసం 8 గంటలు నిద్ర కోసం కేటాయించండి.
- పరీక్షల సమయంలో తప్పనిసరిగా ఉదయం పూట అల్పాహారం మంచి పోషకాలతో కూడినది తీసుకోవాలి. విరామం అవసరం.
- మీ చదువు మీ మెదడుకు ఎక్కాలంటే మధ్యలో బ్రేక్ కూడా తీసుకోవాలి. బ్రేక్ సమయంలో వీలైతే మ్యూజిక్ వినడమో వ్యాయామం చేయడమో చేయాలి.
- పాత ప్రశ్న పత్రాలను ప్రాక్టీస్ చేయడం ద్వారా పరీక్ష రాయడంపై పట్టు సాధిస్తారు. ప్రశ్నావళి ఎలా ఉంటుందో మీకు అర్థమవుతుంది.
- పరీక్షలు అనగానే స్నేహితులు, క్లాస్‌మెట్స్‌కు టాటా చెప్పేయవద్దు. వారితో పాటు టీచర్లు, కుటుంబ సభ్యులకు నిత్యం టచ్‌లో ఉంటే విలువైన సలహాలు, సపోర్టు, ప్రోత్సాహం లభిస్తుంది.

ప్రశాంతత అవసరం



పరీక్షల్లో మంచి మార్కులు సాధించాలన్నా...విజేతలుగా నిలవాలన్నా ప్రణాళిక ఎంతో ముఖ్యం. ముందుగా విద్యార్థులు పరీక్షలంటే భయం వీడి. స్వేచ్ఛగా ఆలోచించి రాస్తే విజయం సులువవుతుంది. పరీక్షలకు ప్రిపేరయ్యే విద్యార్థులు వేకువజామున ప్రశాంతంగా చదవడం అలవాటు చేసుకోవాలి. సబ్జెక్టులవారీగా ప్రాధాన్యత క్రమాన్ని ఎంపిక చేసుకుని చదివితే మంచి సాధించవచ్చు.

–రమేష్‌నాయుడు, తెలుగు టీచర్, ఆర్‌ఆర్‌లేబర్ కాలనీ

ఆత్మవిశ్వాసంతో చదవాలి



పదో తరగతి, ఇంటర్మీడియెట్ పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులు ఎలాంటి ఒత్తిడికి లోనుగాకుండా ప్రశాంతంగా, ఆత్మవిశ్వాసంతో సన్నద్ధం కావాలి. ప్రణాళిక బద్ధంగా చదివితే మంచి మార్కులు సాధించేందుకు అవకాశం ఉంటుంది. అలాగే తగినంత నిద్ర, వ్యాయామం ఉండేలా జాగ్రత్తలు తీసుకోవాలి. ఆత్మ విశ్వాసంతో పరీక్షలకు హాజరైతే విజయం సొంతమవుతుంది.

–సురేష్‌కుమార్, ఉపాధ్యాయుడు, ఆదోని

లబ్ధిదారులకు రిజిస్ట్రేషన్ పత్రాల పంపిణీ


మాట్లాడుతున్న మనోజ్‌రెడ్డి

ఆదోనిటౌన్: పట్టణంలోని 18, 21, 35, 36 వార్డుల పరిధిలో ప్రభుత్వ నుంచి ఇంటి స్థలాలు పొందిన లబ్ధిదారులకు ఆదివారం రిజిస్ట్రేషన్ పత్రాలను పంపిణీ చేశారు. వైఎస్సార్‌సీపీ యువ నేత జయ మనోజ్‌రెడ్డి చేతుల మీదుగా అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జగనన్న కాలనీలో ఇచ్చిన స్థలాలకు సర్వహక్కులు కల్పించేందుకు రిజిస్ట్రేషన్ చేసి ఇస్తున్నట్లు తెలిపారు. ప్రతి పేదవాని సొంతింటి కల నెరవేర్చిన ఘనత ముఖ్యమంత్రి వైఎస్. జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందన్నారు. రానున్న ఎన్నికల్లో వైఎస్.జగన్, వై.సాయి ప్రసాద్ రెడ్డిని ఆశీర్వదించాలని కోరారు. ఆయా వార్డులకు సంబంధించి 400 మంది లబ్ధిదారులకు పత్రాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో వార్డు కౌన్సిలర్లు, వైఎస్సార్‌సీపీ నాయకులు, గృహసారథులు పాల్గొన్నారు.

శ్రీశైలం తరలివెళ్లిన శివభక్తులు


ఇరుముడితో శ్రీశైలానికి పాదయాత్రగా వెళుతున్న భక్తులు

ఆదోనిఅర్బన్: శివరాత్రి పండుగను పురస్కరించుకుని ఆదోనిలో శివమాల వేసిన భక్తులు ఆదివారం శ్రీశైలానికి పాదయాత్రగా బయలుదేరి వెళ్లారు. ఆదోని పట్టణం నుంచి, మరికొందరు ఆత్మకూరులోని వెంకటాపురం గ్రామం నుంచి పాదయాత్రగా వెళ్లారు. ఇంకొందరు స్పర్శ దర్శనం కోసం నేరుగా వాహనాల్లో శ్రీశైలానికి వెళ్లారు. ఈ నెల 8వ తేదీ మహాశివరాత్రి పండుగ సందర్భంగా 41 రోజుల పాటు శివమాల ధరించి నిష్ఠతో స్వామివారికి పూజలు చేశారు. పట్టణంలోని శ్రీశంభు లింగేశ్వరస్వామి దేవాలయంలో గురుస్వామి శైలేంద్రనాథ్ ఆధ్వర్యంలో శివస్వాములకు ఇరుముడి కట్టి మొక్కులు చెల్లించేందుకు శ్రీశైలం యాత్రకు సాగనంపారు. అంతకు ముందు శంభులింగేశ్వర స్వామికి పంచామృతాభిషేకం, విశేష అలంకరణ, మహా మంగళహారతి తదితర పూజలు చేశారు. జ్యోతి లింగేశ్వర 12 మెట్లకు పడిపూజ చేసి భజనలు చేశారు.

సమస్యలకు పరిష్కారం


నాడు: కామవరంలో ఈశ్వర దేవాలయం రోడ్డు


నేడు: సిమెంటు రోడ్డు తర్వాత

కౌతాళం: గ్రామాల్లో ఏళ్ల సమస్యలకు పరిష్కారం దొరికింది. రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా నిర్వహించిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంతో గ్రామాలు అభివృద్ధి బాటపట్టాయి. ప్రతి పంచాయితీకి రూ. 40 లక్షల చొప్పున నిధులు మంజూరు చేయడంతో గ్రామాల్లో సిమెంటు రోడ్లు, డ్రైనేజీ కాలువలు ఏర్పాటు చేశారు. మండల పరిధిలోని కామవరం గ్రామంలో ప్రధాన రోడ్లన్ని సిమెంటు రోడ్లుగా మారాయి. అలాగే కొన్ని రోడ్లకు డ్రైనేజీలతో పాటు గ్రావెల్ రోడ్లు వేశారు. గ్రామాల్లో దశాబ్దాల కాలం నుంచి ఉన్న సమస్యలన్నీ గడప గడప మన ప్రభుత్వం నిధులతో పరిష్కారమయ్యాయి. సిమెంటు రోడ్లు, గ్రావెల్‌రోడ్లు, కల్వర్టు నిర్మాణం పూర్తి కావడంతో కామవరం గ్రామ ప్రజలు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. గడప గడప నిధులు రూ.40 లక్షలతో పాటు మండల గ్రాంట్స్ రూ.10లక్షలతో గ్రామంలోని అన్ని రోడ్లను పూర్తి చేసినట్లు సర్పంచ్ వసంత తెలిపారు. ప్రధాన వీధుల్లో 7 సిమెంటు రోడ్లు, ఎంపీపీ గ్రాంట్ రూ.10లక్షలతో ఐదు గ్రావెల్ రోడ్లను పూర్తి చేసినట్లు చెప్పారు.



నాడు: ఉరుకుంద మొయిన్‌రోడ్డు నుంచి హుసేన్ ఇంటి వరకు, నేడు: సిమెంటు రోడ్డు నిర్మాణం


నాడు: సచివాలయం సమీపంలో..


నేడు: సుందరంగా ఉన్న రోడ్డు


ఎస్సీ కాలనీలో గ్రావెల్, డ్రైనేజీ నిర్మాణం,


బీసీ కాలనీలో డ్రైనేజీ, గ్రావెల్‌రోడ్డు

నిండు జీవితానికి రెండు చుక్కలు


పోలియో చుక్కలు వేస్తున్న మున్సిపల్ కమిషనర్ రామచంద్రారెడ్డి


విరుపాపురంలో చుక్కలు వేస్తున్న సర్పంచ్ ప్రహ్లాద్

ఆదోనిటౌన్: నిండు జీవితానికి రెండు పోలియో చుక్కలు చాలని ఎమ్మెల్సీ మధుసుదన్, పురపాలక కమిషనర్ రామచంద్రారెడ్డి అన్నారు. ఆదివారం పట్టణంలోని పురపాలక ప్రాథమిక పాఠశాలలో పిల్లలకు పోలియో చుక్కలు వేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఐదేళ్లలోపు పిల్లలకు తప్పనిసరిగా పోలియో చుక్కలు వేయించాలని తెలిపారు. డిప్యూటీ డీఎంఅండ్‌హెచ్‌ఓ సత్యవతి మాట్లాడుతూ..ఆదోని పట్టణంలో 19,157 మంది పిల్లలు ఉంటే 18,675 (97 శాతం) మందికి చుక్కలు వేసినట్లు తెలిపారు. ఇంకా 482 మంది పిల్లలకు వేయాల్సి ఉందన్నారు. గ్రామీణ ప్రాంతంలో 85,940 మంది పిల్లలు ఉంటే 81,780 (95శాతం) మంది పిల్లలకు చుక్కలు వేశామన్నారు. 6 అర్బన్ హెల్త్ సెంటర్లు, 106 బూత్ సెంటర్లలో ఈ కార్యక్రమం చేపట్టినట్లు తెలిపారు. పురపాలక చైర్మన్ బి.శాంత తదితరులు పాల్గొన్నారు.

పోలియో రహిత సమాజం స్థాపిద్దాం

ఆదోనిరూరల్: పోలియో రహిత సమాజాన్ని స్థాపిద్దామని వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యదర్శి శేషిరెడ్డి అన్నారు. మండిగిరి పంచాయతీలో పిల్లకు పోలియో చుక్కలు వేశారు. విరుపాపురంలో సర్పంచ్ ప్రహ్లాద్ పిల్లలకు చుక్కలు వేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు.

పోలియో మహమ్మారిని తరిమికొడదాం

కోసిగి: పిల్లలందరికీ పల్స్ పోలియో చుక్కలు వేయించి పోలియో మహమ్మారిని తరిమికొడదామని ఎంపీపీ ఈరన్న, కోసిగి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి మనోజ్‌కుమార్ అన్నారు. ఆదివారం కోసిగిలోని ఆదిఆంధ్ర ప్రాథమిక పాఠశాలలో పిల్లలకు చుక్కలు వేశారు. మండలంలో 10,009 మందికి గాను 9,719 మంది పిల్లలకు పోలియో చుక్కలు వేయించినట్లు తెలిపారు. మిగిలిపోయిన పిల్లలకు సోమ, మంగళ వారాల్లో అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆశావర్కర్లు ఇంటింటికీ వెళ్లి పోలియో చుక్కలు వేస్తారని చెప్పారు.


కోసిగిలో..


కౌతాళంలో..


పెద్దకడబూరులో..

పిల్లలందరికీ ఆరోగ్యం

కౌతాళం: పోలియో చుక్కలతో పిల్లలు ఆరోగ్యంగా ఉంటారని ఫ్యామిలి డాక్టర్ పోగ్రాం జిల్లా వైద్యాధికారి బాలమురళీకృష్ణ అన్నారు. మండలంలో పల్స్ పోలియో కార్యక్రమాన్ని ఆయన పర్యవేక్షించారు. కౌతాళంలో 96శాతం, బదినేహాల్‌లో 93శాతం పోలియో చుక్కలు వేసినట్లు ఆయా పీహెచ్‌సీల వైద్యులు తెలిపారు.

ఆదోనిఅర్బన్: మున్సిపాలిటీ అమరావతి నగర్ పరిధిలోని పంజరాపోల్ కాలనీలో పల్స్ పోలియో కార్యక్రమాన్ని నిర్వహించారు. వైఎస్సార్‌సీపీ నాయకులు మధుసుదన్ శర్మ, కురువ రవికుమార్, అగ్గిరాముడు, అబ్రహం పాల్గొన్నారు.

పెద్దకడబూరులో 91 శాతం

పెద్దకడబూరు: మండలంలో 6015 మంది చిన్నారులు ఉండగా 5475 (91 శాతం) మంది చిన్నారులకు పోలియో చుక్కలు వేసినట్లు వైద్యాధికారులు తెలిపారు.


కోసిగి: చుక్కలు వేస్తున్న ఎంపీపీ ఈరన్న


కౌతాళం బస్టాండ్‌లో పోలియో చుక్కలు వేస్తున్న ఎంపీడీఓ

మహాశివరాత్రి ప్రత్యేకతపై అవగాహన


జెండావిష్కరణ చేస్తున్న నిర్వాహకులు


శివలింగం

కోసిగి: మహాశివరాత్రి పర్వదినం జాగరణ ప్రత్యేకతను ప్రతి ఒక్కరూ తెలుసుకోవాలని ఓంశాంతి ప్రజాపిత బ్రహ్మకుమారి ఈశ్వరీయ విద్యాలయం నిర్వాహకురాలు బి.కె. నిర్మల, అమృతేశ్వరి అన్నారు. ఆదివారం కోసిగిలో శివలింగాలను ట్రాక్టర్, కారులపై కొలువుంచి ప్రత్యేక పూజలు చేశారు. మేళతాలలతో పురవీధుల మీదుగా ఊరేగించారు. ప్రజలకు అవగాహన కల్పించారు. స్థానిక నాడుగేని వీధిలో నిర్మించనున్న ఆశ్రమం వద్ద శాంతి జెండాను ఆవిష్కరించారు. విశ్వమానవకోటి కోసం పరమ శివుడు చేసిన త్యాగాలను స్మరించుకుని మహాశివరాత్రిని జరుపుకుని మానసిక ప్రశాంతత, ఆధ్యాత్మికతను అలవరుచుకోవాలని సూచించారు. ఈశ్వరీయ విద్యాలయ సభ్యులు, ఎంపీపీ ఈరన్న, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

ట్రాఫిక్ రూల్స్ ఉల్లంఘిస్తే చర్యలు


ప్రజలకు అవగాహన కల్పిస్తున్న ట్రాఫిక్ సీఐ

ఆదోనిటౌన్: పట్టణంలో ట్రాఫిక్ నిబంధనలను ఉల్లంఘిస్తే చర్యలు తప్పవని ట్రాఫిక్ సీఐ మంజునాథ్ తెలిపారు. ఆదివారం ఆర్టీసీ బస్టాండ్ వద్ద ఆటో డ్రైవర్లకు కౌన్సిలింగ్ ఇచ్చారు. రోడ్లపై ఆటోలను నిలబెట్టి కాలక్షేపం చేస్తూ ట్రాఫిక్‌కు అంతరాయం కలిగిస్తే భారీ జరిమానాలు విధిస్తామని హెచ్చరించారు. మద్యం తాగి వాహనాలు నడపడం, లైసెన్స్ లేకుండా రోడ్లపై ఆటోలను తిప్పడం, సెల్‌ఫోన్‌లో మాట్లాడుతూ డ్రైవింగ్ చేయడం చట్టరీత్యా నేరమన్నారు. ఆర్టీసీ బస్టాండ్, రైల్వేస్టేషన్ ప్రధాన కూడళ్లలో ట్రాఫిక్ సమస్య తలెత్తుతోందని చెప్పారు. ఆటో డ్రైవర్ల నిర్లక్ష్యంతో ట్రాఫిక్ సమస్య ఉత్పన్నం అవుతోందని ప్రజల నుంచి ఫిర్యాదులు వస్తున్నాయని తెలిపారు. డ్రైవర్లు తమ పద్ధతిని మార్చుకోవాలని హెచ్చరించారు. ఏఎస్ఐ లక్ష్మన్న తదితరులు పాల్గొన్నారు.